సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 16 । మార్చి । 2025



పడకేసిన మెడికల్ కాలేజీ నిర్మాణం

పాలకొల్లు మండలం దగ్గులూరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పడకేశాయి. బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. 8లో ▸



'పది' విజయానికి.. పన్నెండు సూత్రాలు

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల్లో విజయ కేతనానికి పన్నెండు నియమాలు పాటించాలని సూచిస్తున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.19	4.50
నరసాపురం	6.20	4.48
తాడేపల్లిగూడెం	6.15	4.59

ఇంటింటికీ పోలీసుల కాపలా

- చంద్రబాబు పర్యటనలో అడుగడుగునా నిర్బంధం
- పశువధ బాధితుల హౌస్ అరెస్ట్
- స్థానికులను ఇళ్ల నుంచి బయటకు రానివ్వని పోలీసులు
- బంధువు కడసారి చూపుకోసం దగ్గరుండి తీసుకువెళ్లిన పోలీసులు



ప్రజావేదిక ముగిసిన అనంతరం కౌంటర్ల వద్ద భోజనాల కోసం వేచి చూస్తున్న ప్రజలు

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: వెంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు సీఎం చంద్రబాబు తణుకు పర్యటన సాగింది. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం శనివారం పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే అడుగడుగునా పోలీసులా ఆంక్షలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఓ ఏరియా ప్రజలను ఉదయం నుంచి సాయంత్రం వరకు గృహనిర్బంధం తరహాలో బయటకు రానివ్వలేదు. తణుకు రూరల్ తేతలిలో అక్రమ పశువధతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కొండాలమ్మ పుంత, మహాలక్ష్మి నగర్ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. సీఎం వద్ద తమ గోడు వెళ్లబోసుకోవాలని స్థానికులు భావించారు. అయితే ఆయా ప్రాంతాల నుంచి ప్రజలెవరూ బయటకురాకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. పర్యటన ముగిసిన సాయంత్రం 4 గంటల వరకు గృహ నిర్బంధం కొనసాగింది. సజ్జాపురం అండర్ పాస్ వద్ద పోలీసు పహారాతో పాటు ఇళ్ల వద్ద సచివాలయ పోలీసులు, సిబ్బందిని కాపలా ఉంచారు. దీంతో పిల్లలను పాఠశాలలకు పంపేందుకు, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమస్యలు చెప్పుకునే అవకాశం లేకపోవడంతో..

సీఎంతో తమ సమస్యలు చెప్పుకోవాలన్న ఆశతో పలువురు ప్రజావేదిక వద్దకు వచ్చారు. మాట్లాడేందుకు వారికి మైక్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సీఎంకు కొందరు తమ సమస్యలు చెప్పుకునే ప్రయత్నం చేయగా తర్వాత వింటానంటూ ఆయన చెప్పడంతో పోలీసులు వారిని బలవంతంగా కూర్చోబెట్టారు. ఎంతో కష్టపడి సభకు వస్తే సమస్యలు వినే వారే లేకుండా పోయారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

ఉదయం 8 గంటలకు చంద్రబాబు హెలీప్యాడ్ వద్దకు చేరుకోవాల్సి ఉండగా 9 గంటలకు రావడంతో గంట ఆలస్యంగా పర్యటన మొదలైంది. ఎన్టీఆర్ పార్కులో పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖీ, చెత్త ఊడ్చే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన కంపోస్ట్ ద్వారా డిస్పోజ్ చేసే యంత్రాలను పరిశీలించారు. ఐక్య

ఉసూరుమంటూ ఇంటిముఖం

నగర్ పార్కును పరిశీలించి పీ4 విధానంలో అభివృద్ధి చేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ప్రజావేదిక వద్ద ఉదయం 10.36 నుంచి 12.40 గంటల వరకు కార్యక్రమం సాగింది. గంటన్నర ఆలస్యం కావడంతో ఎండకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మరోపక్క భోజనాలు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భోజనాలు లేవని టేబుళ్లను తీసేయడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఇంటి వద్ద వంట చేసుకోకుండా వచ్చేశామని, ఇంత ఎండలో ఇప్పుడు ఇంటికి వెళ్లి వంట ఎలా చేసుకునేదంటూ కొందరు మహిళలు వాపోయారు.

కడసారి చూసేందుకూ పోలీసుల కాపలాతోనే



ఇళ్ల వద్ద మహిళా పోలీసుల కాపలా

స్థానిక మహలక్ష్మి నగర్‌కు చెందిన కర్రి రాజశేఖర్ సమీప బంధువు ఏలూరులోని పోతునూరులో మృతిచెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వారిని బయటకు పంపేందుకు మొదట పోలీసులు అంగీకరించలేదు. విషయాన్ని నిర్ధారించుకున్న అనంతరం ఆటోలో దగ్గరుండి వారిని అక్కడ దింపి వచ్చినట్టు స్థానికులు తెలిపారు. పాఠశాలల్లోని తమ పిల్లలకు క్యారేజీలు ఇచ్చేందుకు సైతం పోలీసులు వెంట వచ్చారన్నారు. గృహనిర్బంధంపై కొందరు పోలీసులతో వాగ్వావాదానికి దిగారు. మరోపక్క పోలీసుల హెచ్చరికలతో వ్యాపారులు సైతం తమ దుకాణాలను అరకొరగానే తెరిచారు.

నిజ నిర్ధారణ కమిటీ పర్యటన



చల్లవారిగూడెంలో ఇంకా పునాది దశలోనే ఉన్న నిర్మాణాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని చల్లవారిగూడెం ఆర్‌అండ్ఆర్ కాలనీలో ఓపీడీఆర్ నిజ నిర్ధారణ కమిటీ శనివారం పర్యటించింది. ఐదుగురు సభ్యుల బృందం కాలనీలో పర్యటించి ప్రజల నుంచి వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ గోదావరి వరదల నేపథ్యంలో కూనవరం, వేలేరుపాడు, కక్కునూరు, పోలవరం, వీఆర్‌పురం, వి.రామచంద్రాపురం, చింతూరు గ్రామాలకు చెందిన నిర్వాసితులకు చల్లవారిగూడెంలో ఇళ్లను ఇచ్చారని.. ఆ ప్రాంతంలో పెద్ద గోతులు, తుప్పలతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. దీంతో నిర్వాసితులే సొంత సొమ్ములు ఖర్చు చేసి గోతులను సరిచేసుకున్నారని సదరు సొమ్మును ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. చల్లవారిగూడెం ఆర్‌అండ్ఆర్ కాలనీలో అసంపూర్తి నిర్మాణాలు 2 వేలకు వరకు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే నిర్మించాలన్నారు. నాలుగు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లో ఒక్కటే పనిచేస్తుందని, నీటి కోసం కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మిగిలిన మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లను వాడుకలో తీసుకురావాలన్నారు. వెంటనే రైతు భరోసా, తల్లికి వందనం తదితర సంక్షేమ కార్యక్రమాలు కాలనీలో వెంటనే అమలు చేయాలని డిమండ్ చేశారు. కమిటీలో జాతీయ అధ్యక్షుడు చిగురుపాటి భాస్కరరావు, సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

న్యూస్‌రీల్

నడిరోడ్డుపై మొరాయింపు



కోలమూరులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఉండి: ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. నడిరోడ్డుపై మొరాయించడంతో ప్రయాణికులు మండుటెండలో లబోదిబోమంటున్నారు. భీమవరం డిపోకు చెందిన తాడేపల్లిగూడెం వెళ్లే బస్సు కోలమూరు సెంటర్‌కు వచ్చేసరికి ఆగిపోయింది. ఆ ఎండలో ప్రయాణికుల వెతలు వర్ణనాతీతం. మరో బస్సులో ప్రయాణికులు వెళ్లాల్సి వచ్చింది.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



విక్టరీ సింబల్ చూపిస్తున్న విద్యార్థులు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రధాన పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 52 కేంద్రాల్లో ఈ నెల 1న పరీక్షలు ప్రారంభం కాగా ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. శనివారం నిర్వహించిన కెమిస్ట్రీ, కామర్స్ జనరల్ పరీక్షకు 15,006 మందికి 14,584 మంది హాజరుకాగా, ఒకేషనల్ పరీక్షకు 927 మంది విద్యార్థులకు 778 మంది హాజరైనట్లు డీఐఈవో ఎ.నాగేశ్వరరావు చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఒకేషనల్, 19, 20 తేదీల్లో హెచ్ఈసీ పరీక్షలు నిర్వహించాల్సివుంది. ప్రధాన పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంగా ఇంటి ముఖం పట్టారు. రెండేళ్ల పాటు కలసిమెలసి చదివిన స్నేహితులు ఈ రోజు నుంచి దూరం కానుండడంతో కొంతమంది విద్యార్థులు భావోద్వేదానికి గురయ్యారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని బై బై చెప్పుకుంటూ ప్రయాణమయ్యారు. 15 రోజుల పాటు నిర్వహించిన పరీక్షల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వైఎన్ కళాశాల అటానమస్ పొడిగింపు



యూజీసీ ఉత్తర్వులు చూపిస్తున్న యాజమాన్యం

నరసాపురం: నరసాపురం వైఎన్ కళాశాల అటానమస్ స్టేటస్‌ను 2035 వరకూ పాటు పొడిగిస్తూ యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది కళాశాల నాలుగోసారి నాక్ గుర్తింపు సాధించింది. దీంతో ఈ ఏడాది ఎలాంటి పరిశీలన లేకుండా 10 ఏళ్ల పాటు అటానమస్ స్టేటస్ పెంచారని కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ చెప్పారు. కళాశాల అభ్యున్నతికి ఇది మరింత దోహదం చేస్తుందని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్ అన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గోపి



లక్కోజు గోపికి నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకత్వం

ఏలూరు (టూటౌన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా లక్కోజు రాజగోపాలాచారిని(గోపి) నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ నియామక పత్రాన్ని గోపికి అందజేశారు. స్థానిక పవర్ పేట వడ్రంగి సంక్షేమ సంఘం భవనంలో శనివారం జరిగిన జిల్లా బీసీ సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా రాజగోపాలాచారిని, మహిళా కార్యదర్శిగా బాలిన ధనలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శిగా చిదరబోయిన శ్రీనివాస్ యాదవ్, నగర యూత్ అధ్యక్షుడిగా జరజాపు రాఘవ, యూత్ కార్యదర్శిగా ఇదలాడ నాని, బంకురి వెంకట్, బీసీ మహిళ అధ్యక్షురాలిగా మోతిక రాఘవమ్మ, జిల్లా కమిటీ సభ్యులుగా బాయి వెంకట్రావు, కింజంగి రాజు, కొత్తల శివ, కెల్ల దుర్గాప్రసాద్, చిట్టు మోజు రత్నబాబు, కొండల ప్రసాద్ తదితరులను నాయకులును నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.

క్రొవ్విడిలో దారుణం

బాలుడిని గొలుసులతో కట్టేసిన వైనం



లోకేష్ వరుణ్‌ను గొలుసుతో కట్టిన దృశ్యం

నిడమర్రు: కొల్లేరు జీరాయితీ చేలల్లో చేపలు పడుతున్నాడంటూ ఓ బాలుడిని కొట్టి గొలుసుతో కట్టేసిన సంఘటన శుక్రవారం నిడమర్రు మండలం క్రొవ్విడిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం 5వ కాంటూరు పరిధిలో నిరుపయోగంగా ఉన్న చేలల్లో ఉప్పరగుడెంకు చెందిన తాటిపర్తి బుజ్జన్న కుమారుడు లోకేష్ వరుణ్ చేపలు పడుతుండడం గమనించిన అదే గ్రామానికి చెందిన గండికోట వెంకన్న, పండు అతన్ని గ్రామంలోకి తీసుకొచ్చి గొలుసుతో కట్టేశారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారి ఇంటికి వెళ్లి ప్రాధేయపడినా వదలలేదు. లోకేష్ తాత, మావయ్య విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో వారు మందలించారు. అప్పుడు బాలుడ్ని విడిచి పెట్టినట్లు తెలిసింది. లోకేష్ తండ్రి సాక్షితో మాట్లాడుతూ సుమారు 3 గంటల పాటు తన కొడుకుని కట్టేశారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలరించిన కళాపరిషత్ నాటికలు



'విడాకులు కావాలి' నాటికలోని దృశ్యం



'కిడ్నాప్' నాటికలోని ఓ సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: కళలకు నిలయమైన పాలకొల్లు పట్టణంలో పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో నాటికల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్థానిక బస్టాండ్ వద్ద అడబాల థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు విడాకులు కావాలి, కిడ్నాప్ నాటికలు ప్రదర్శించారు. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు, అపోహలు, చిన్నచిన్న సమస్యలు తలెత్తటం సహజమని అంత మాత్రాన్న పట్టింపులకు పోయి విడాకులు కావాలనుకోవడం సమంజసం కాదనే కథాశంతో విడాకులు కావాలి అన్న నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా.. గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజెప్పే సందేశంతో కిడ్నాప్ నాటిక కళా ప్రియులను ఆకట్టుకుంది. ఈ పోటీల్ని మంత్రి రామానాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకటసత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, కళాపరిషత్ అధ్యక్షుడు కె.వి.కృష్ణవర్మ, సెక్రటరీ మానాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోనస్ బకాయిలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వన సంరక్షణ సమితిల్లో పని చేస్తున్న కూలీలకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వ్యవసాయ కార్మిక సంఘం బృందం తెలిపింది. శనివారం అటవీ శాఖ జిల్లా అధికారి శుభమ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం ఉపాధ్యక్షులు ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులు సేకరించే తునికాకు నేటికి బోనస్ బకాయిలు రూ.5 కోట్ల వరకూ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, పేదల పట్ల ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మెట్ట ప్రాంతంలో దళితులు, గిరిజనులు ఇతర పేదలకు రావాల్సిన వేతన బకాయిలు అందక అవస్థలు పడుతున్నారని అన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

- పెసర, మినుము రైతుల ఆవేదన
- పంటను నష్టానికి అమ్ముకోవాల్సిన దుస్థితి



జాలిపూడిలో చేతికొచ్చిన పెసర పంట

దెందులూరు: ఏలూరు జిల్లాలో పెసర, మినుము రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఆశలు పెట్టుకుంటే ఇంతవరకూ వాటి ఊసే లేదు. గత ఏడాది నవంబర్‌లో పెసర, మినుము పంట సాగు చేశారు. ఫిబ్రవరి నెలాఖరుకు దిగుబడి చేతికొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో పంటల సాగు పూర్తయ్యే నాటికి రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వం ఇంతవరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు దెందులూరు కోపరేటివ్ సొసైటీకి వెళ్లి నిలదీశారు.

ఏలూరు జిల్లాలో 12,900 ఎకరాల్లో పెసర, 2500 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయం ఇవ్వకపోయినా పండించిన పంటను కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఎలా? అని రైతులు, రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే తక్కువ ధరకు అమ్ముకోవాలని.. పెట్టుబడి సొమ్ము కూడా అందదని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు సైతం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మాట్లాడడం లేదు. జాయింట్ కలెక్టర్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా.. ఆ ఆదేశాలు అమలు కాలేదు. పండించిన పంటను మంచి ధరకు అమ్ముకోవచ్చని ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశ మిగిలింది. ఇలాగైతే నష్టానికి అమ్ముకోవడం తప్ప వేరే గత్యంతరం లేదంటున్నారు.

ఇంకా పూర్తికాని ఈ–క్రాప్ నమోదు

వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నమోదు, రైతుల వివరాలు పంట వేసిన తరువాత రైతుతో మాట్లాడి ఈ–క్రాప్ నమోదు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తరువాత ఇప్పటికీ పంట నమోదు కార్యక్రమం చేస్తున్నారు. ఈ విషయాన్ని మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖాధికారులు ధ్రువీకరించారు.

కొనుగోలుకు ఇబ్బంది ఏంటి?



తాము పండించిన పెసలు, మినుములు కొనుగోలు చేయడానికి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటి.? పంటను ఇంట్లో ఉంచండి.. కొంటాం అంటున్నారు. రేపు మాపు అంటూ గడిపేస్తున్నారు. స్పష్టమైన ప్రకటన చేయాలి.

– మాగంటి రాజు, రైతు, దెందులూరు

సర్వే పేరిట తాత్సారం



ప్రభుత్వ విధానంపై నమ్మకం లేదు. అనేక మంది రైతులు నష్టానికి అమ్ముకుంటున్నారు. రైతులు కన్నీరు పెడితే ప్రభుత్వానికి మంచిదా.. ఆలస్యం లేకుండా కొంంటే నష్టానికి అమ్ముకోవాల్సిన అవసరం ఉండదు.

– కొలుసు గణపతిరావు, రైతు, సొసైటీ మాజీ చైర్మన్

ఇమామ్, మౌజన్‌లు ధ్రువపత్రాలు సమర్పించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని మసీదుల్లో ఇమామత్ నిర్వహిస్తూ ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందుకుంటున్న ఇమామ్‌లు, మౌజన్‌లు, వారితో పాటు ప్రస్తుతం ఉన్న ముతవల్లి లేదా మసీదు అధ్యక్షులు వారి ఆధార్ జిరాక్స్ కాపీలు 2, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2, మసీదు పేరుపై ఉన్న బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు తమ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ కేఎండీ అలీం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

డీఆర్వో వి. విశ్వేశ్వరరావు

ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్వో ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు సమీక్షించారు. 16న ఫారెస్టు రేంజ్ అధికారి పరీక్ష, 17న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్ తో పాటు గుర్తింపు కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఇన్విజిలేటర్లు వద్ద కూడా మొబైల్ ఉండరాదని చెప్పారు. పరీక్ష కేంద్రాలు వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.

మురికి కూపంలా ఏలూరు



రైల్వేస్టేషన్ రోడ్డులో..

ఏలూరులోని పలు డ్రెయిన్లు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. మురుగు నీరు పారక తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. సాయంత్రం దోమల వల్ల ఇళ్లలో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎంత చెప్పినా ఇది తమ పని కాదంటూ తప్పించుకుంటున్నారని, ఇప్పటికైనా డ్రైనేజీల్లో వ్యర్థాలు తీసి తమ ఆరోగ్యాన్ని కాపాడాలని ఏలూరు వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



కొత్తపేటలోని నూకాలమ్మ గుడి వద్ద..



జీడీ కాలనీ రోడ్డులో..



ఏలూరు గూడ్స్ షెడ్డు రోడ్డు వద్ద..

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి మోషేనురాజు పరామర్శ


శ్రీనివాసవర్మను పరామర్శిస్తున్న మోషేనురాజు

భీమవరం : ఢిల్లీలో రోడ్డుప్రమాదంలో కాలికి గాయమైన కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు పరామర్శించారు. భీమవరంలో శనివారం శ్రీనివాసవర్మ నివాసానికి వెళ్లిన మోషేనురాజు ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


గిరిజన సంప్రదాయ నృత్యంలో పాల్గొన్న తెల్లం బాలరాజు దంపతులు

బుట్టాయగూడెం: గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఆదివాసీలపై ఉందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న గుబ్బల మంగమ్మతల్లి జాతర మహోత్సవాల్లో వారు పాల్గొని పూజారి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత బాలరాజు దంపతులకు ఆలయ కమిటీవారు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు కొద్దిసేపు గిరిజన సంప్రదాయ డోలు కొయ్యి నృత్యాలు చేసి సందడి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా గంగరాజు, కోర్సా రాంబాబు, గుజ్జు రామారావు, తదితరులు బాలరాజు దంపతులను శాలువా కప్పి సత్కరించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఉంగుటూరు: చేబ్రోలు రైల్వేస్టేషన్‌లోని వెయింటింగ్ హాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, తెలుగురంగు చిన్ని గీతల ఫుల్ హ్యాండ్ షర్టు, బిస్కట్ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే 94906 17090, 99480 10061 నంబర్లలో తెలియజేయాలన్నారు.

పడకేసిన మెడికల్ కాలేజీ నిర్మాణం

- నాడు ఓ పక్క పనులు జరుగుతున్నా ఏమీ జరగడం లేదంటూ నిరసనలు
- నేడు పది నెలలైనా ఆ వైపే చూడని మంత్రి నిమ్మల
- మెడికల్ కళాశాల బిల్లులు రాక పనులు నిలుపుదల చేసిన సంస్థ
- ఇప్పటి వరకూ జరిగిన రూ. 75 కోట్ల పనులు గంగపాలేనా...?
- ఇదీ దగ్గులూరు మెడికల్ కళాశాల దుస్థితి


నాడు నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్న కళాశాల ప్రాంగణం (ఫైల్)


గత ప్రభుత్వంలో జరిగిన పైలింగ్ పనులు (ఫైల్)


వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన కళాశాల పనులు (ఫైల్)


కూటమి దెబ్బకు నిర్మానుష్యంగా మారిన మెడికల్ కళాశాల ప్రాంగణం

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పడకేశాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్న సమయంలో.. నాడు ప్రతిపక్షంలో ఉన్న రామానాయుడు, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మెడికల్ కళాశాల వద్దకు వెళ్లి పనులు ఏమీ జరగడం లేదని నానా యాగీ చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా అప్పుడు అల్లరి చేసిన టీడీపీ పెద్దలు వివిధ పదవుల్లో ఉండి కూడా ఇప్పటివరకు కళాశాల వైపే కన్నెత్తిచూసిన పాపాన పోలేదు. కనీసం బిల్లులు కూడా మంజూరు చేయకపోవడంతో ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

సుమారు రూ.75 కోట్లు వృథాయేనా..?

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, పరిసర ప్రాంత ప్రజలు మెడిసిన్ విద్య అభ్యసించే నిమిత్తం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 60 ఎకరాల్లో రూ.475 కోట్ల వ్యయంతో ఇక్కడ మెడికల్ కళాశాల మంజూరు చేశారు. వర్చువల్ పద్ధతిలో ఆయన శంకుస్థాపన కూడా చేశారు. 2023 ఫిబ్రవరిలో ల్యాండ్ అగ్రిమెంట్ చేసుకున్న మెగా కన్‌స్ట్రక్షన్ ఆగస్టులో పనులు ప్రారంభించింది. మొత్తం నిర్మాణం చేయాల్సిన బ్లాక్‌లు 16 కాగా మొదలుపెట్టిన బ్లాక్‌లు 3. వాటిలో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ బ్లాక్‌లు పైల్స్ వర్క్‌లు (పిల్లర్ పనులు) పూర్తవ్వగా, 24 గంటల సర్వీస్ బ్లాక్‌లో 82 శాతం పైల్స్ వర్క్ పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.75 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. వీటి నిమిత్తం ఇంకా సుమారు రూ.30 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ పనులు నిలుపుదల చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ సైట్‌లో ఉన్న ఇసుక, ఇనుము, కంకర వంటి మెటీరియల్‌ను మెగా కంపెనీకి సంబంధించి మిగతా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల నిమిత్తం తరలించేశారు. మొత్తం సైటు ఖాళీ చేసేశారు.

పది నెలలైనా పత్తా లేరు

నాడు ప్రతిపక్షంలో ఉన్న రామానాయుడు, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మెడికల్ కళాశాల వద్దకు వెళ్లి ఓ పక్క పనులు జరుగుతుండగా మరోపక్క కళాశాల పార్కింగ్ స్థలంలో నిలబడి ఇక్కడ ఏ పనులూ జరగడం లేదంటూ చాలా హడావుడి చేసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. అక్కడ అంతా బురదే తప్ప పనులేమీ జరగడం లేదని తమ అనుకూల 'పచ్చ' మీడియా ద్వారా రాద్ధాంతం సృష్టించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 10 నెలలు కావస్తోంది. అధికారంలో లేనప్పుడు మెడికల్ కళాశాల చుట్టూ తిరిగి రాద్ధాంతం చేసిన రామానాయుడు నేడు మంత్రి హోదాలో ఉండి మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మెడికల్ కళాశాల వద్దకు వెళితే కాంట్రాక్టర్‌ను ప్రశ్నించలేని దుస్థితి. బిల్లులు విడుదల చేస్తే తాము పనులు మొదలు పెడతామని కాంట్రాక్టర్ ఎదురు ప్రశ్నిస్తారేమోననే భయంతో మంత్రి నిమ్మల మెడికల్ కళాశాల వైపు వెళ్లడం లేదనే ప్రచారం జరుగుతోంది. మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో పనులు ఆపించారని, కొద్ది రోజులు గ్యాప్ ఇచ్చి ఆపై నిధులు రిలీజ్ చేసి తమ హయాంలోనే మెడికల్ కళాశాల పూర్తయిందని గొప్పలు చెప్పుకోవడానికే ఇదంతా చేస్తున్నారని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

చిన్నారులపై మారుటి తండ్రి దాడి

- గాయపడిన చిన్నారి సాత్విక్‌కు ఏరియా ఆసుపత్రిలో చికిత్స
- వివరాలు సేకరించిన అధికారులు


గాయపడిన బాలుడు సాత్విక్

జంగారెడ్డిగూడెం: చిన్నారులను పాశవికంగా హింసించిన ఘటన మరోసారి జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. రెండవ భర్త దాడిలో వివాహిత, ఆమె సంతానం దాడికి గురయ్యారు. పట్టణానికి అంకుశం జ్యోత్స్న, పూతి ఉమామహేశ్వరరావు భార్యభర్తలు. వీరి సంతానం సాత్విక్ (11) 4వ తరగతి చదువుతున్నాడు. కరుణ సత్య (8) 2వ తరగతి చదువుతున్నారు. కాగా జ్యోత్స్న ఉమామహేశ్వరరావుకు దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో పుచ్చకాయల దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం కాగా వారు గౌరీ పట్నంలో వివాహం చేసుకుని స్థానిక సుబ్బంపేట రోడ్డులో నివాసం ఉంటున్నారు. గత మూడు రోజులుగా దుర్గాప్రసాద్ మద్యం సేవించి వచ్చి పిల్లలు సాత్విక్, కరుణసత్యలను కొడుతూ ఉన్నాడు. అడ్డుకోబోయిన జ్యోత్స్నపై కూడా దాడి చేశాడు. స్థానికులు గమనించి గాయపడిన సాత్విక్‌ను శనివారం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు సాత్విక్‌కు చికిత్స అందిస్తుండగా, జ్యోత్స్న, కరుణసత్య ఆసుపత్రిలోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది ఆసుపత్రికి వెళ్లి జ్యోత్స్న, చిన్నారులను అడిగి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. సీఐ వి.కృష్ణబాబు వివరాలు సేకరించారు. గతంలో కూడా దుర్గాప్రసాద్ తనను చంపడానికి ప్రయత్నించాడని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జ్యోత్స్న తెలియజేసింది.


చికిత్స పొందుతున్న బాలుడిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న సీడీపీవో పి.బ్యూలా

చెట్టును ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

పెదవేగి : మోటార్‌సైక్లిస్టు చెట్టును ఢీకొని మృతి చెందిన ఘటన కొప్పాకగూడెంలో చోటుచేసుకుంది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన మరీదు రాంబాబు (57) శనివారం విజయరాయి నుంచి బొమ్ములూరు వెళుతుండగా కొప్పాకగూడెం వద్దకు వెళ్లేసరికి ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నూజివీడులో చోరీ

నూజివీడు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన నూజివీడులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం పట్టణంలోని బాపూనగర్‌లో చెరువుగట్టు ప్రసాద్ అనే వ్యక్తి ఈ నెల 8న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హనుమాన్‌జంక్షన్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లాడు. శనివారం ఉదయం తలుపు తీసి ఉండటం పక్కింటి వారు వెంటనే ప్రసాద్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వెంటనే అతను హనుమాన్ జంక్షన్ నుంచి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా, అరమరలు అన్నీ తీసి వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఇంట్లో ఉంచిన రూ.2 లక్షల నగదును దొంగలు చోరీ చేసినట్టు గుర్తించాడు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్య శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. కాగా నాలుగు రోజుల క్రితం ఎంప్లాయిస్ కాలనీలో సైతం దొంగలు పడ్డారు. రెండిళ్ల తాళాలు పగులగొట్టి జొరబడ్డారు. అయితే ఆ ఇళ్లలో ఏ నష్టం జరగలేదని తెలిసింది.

పది విజయానికి.. పన్నెండు సూత్రాలు

గణపవరం: విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల గడువు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో భయం, ఆందోళన, పెరిగిపోతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయితే ఆందోళన మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నిరంతర సాధన, గుండెలనిండా ధైర్యం, నమ్మకమే విజయతీరాలకు చేర్చుతుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థి పదోతరగతిలో విజయ కేతనం ఎగరవేయడానికి ఈ పన్నెండు నియమాలు పాటించాలని సూచిస్తున్నారు.


పరీక్షకు సిద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు

భయం వద్దు

అనవసర భయాలవల్ల టెన్షన్ వస్తుంది. పరీక్షలపై దృష్టిపెట్టి, ఆయా సబ్జెక్టుల్లో నిరంతర సాధన చేయాలి. విద్యార్థులు ప్రతి రోజూ పదినిముషాల పాటు ధ్యానం లేదా పూజ చేస్తే మంచిది.

సందేహమెందుకు ?

చదివిన ప్రశ్నలు రాకపోతే.. చదివింది గుర్తుకు రాకపోతే... లాంటి ఆలోచనలు దరిచేరనీయవద్దు.

ప్రణాళిక ముఖ్యం

ఎంత చదివామన్నది ముఖ్యంకాదు.. ప్రణాళికతో ఎలా చదివామన్నది ముఖ్యం.

జాగ్రత్త అవసరం

చదువు ధ్యాసలో పడి ఆహారాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. వేళకు తేలికపాటి, బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. పండ్లరసాలు, కొబ్బరిబొండం నీరు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

మంచి నిద్ర మేలు

సరైన మోతాదులో నిద్ర అవసరం. పరీక్షల సమయంలో అర్ధరాత్రి దాటే వరకూ చదవడం వల్ల ఉపయోగం ఉండదు. రాత్రి పదిగంటలకు పడుకుని, వేకువజామునే లేచి చదివితే మంచిది.

కొత్త విషయాల జోలికి పోవద్దు

పరీక్షల సమయంలో కొత్తవిషయాలు నేర్చుకునే ప్రయత్నం వద్దు. ఈ సమయంలో కేవలం రివిజన్ మాత్రమే చేయాలి. ఇదివరకు చదవని ప్రశ్నలు మరీ ముఖ్యమైనవి అయితేనే తప్ప నేర్చుకునే ప్రయత్నం చేయవద్దు.

సెల్‌ఫోన్లకు దూరం

పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ చూడటం, సెల్‌ఫోన్ ముచ్చట్లు, ఫ్రెండ్స్‌తో చర్చలు అనవసరం.

ముందుగా వెళ్లడం శ్రేయస్కరం

పరీక్షకు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరండి. దారిలో ప్రయాణంలో చదవడం, పరీక్షా గదిలోకి వెళ్లేముందు ఓసారి పుస్తకం తీసి చూడాలన్న ఆలోచనే వద్దు.

ఇతరులను పట్టించుకోకండి

పరీక్ష రాసే సమయంలో పక్కకి చూడవద్దు. ఎవరు ఎన్ని ఎడిషనల్ షీట్లు తీసుకుని రాస్తున్నారన్నది పట్టించుకోకండి. అది మీలో తెలియని ఆందోళన పెంచుతుంది.

తెలిసిన ప్రశ్నలకు ముందు ప్రాధాన్యత

బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయండి. సాధ్యమైనంత వరకూ దిద్దుబాటు లేకుండా చూడండి. టైం పూర్తయ్యేవరకూ పరీక్షాహాలు వదిలి రాకండి. హాల్‌టికెట్ నంబరు, ప్రశ్నల నంబర్లు ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవడం మంచిది.

ప్రశాంతంగా ఉండండి

మామూలు రోజుల్లో ఎలా ఉంటారో పరీక్షలప్పుడు కూడా అలాగే ప్రశాంతంగా ఉండండి. పరీక్షరాసిన వెంటనే ఇంటికి రావడం మంచిది. ఫలానా ప్రశ్నకు సమాధానం సరైనదేనా కాదా అంటూ స్నేహితులతో చర్చ పెడితే ఒకరు రైట్‌అని, మరొకరు రాంగ్ అని చెబితే మీరు పూర్తి కన్ఫ్యూజన్‌లోకి వెళ్లిపోయి, మరుసటి రోజు పరీక్షపై అనవసర భయం ఏర్పడుతుంది.

విసుక్కోవద్దు.. పోల్చవద్దు

తల్లిదండ్రులు పిల్లలను విసుక్కోవడం, చదవడం లేదని తిట్టడంవంటివి చేయవద్దు. పరీక్షలు రాస్తున్న పిల్లలను ఫంక్షన్‌లు వంటి ఇతర కార్యక్రమాలకు తీసుకెళ్లడం మంచిదికాదు. ముఖ్యంగా ఇతర విద్యార్థులతో మీ పిల్లలను అస్సలు పోల్చవద్దు.

ఆహారపు అలవాట్లతో అప్రమత్తం



పరీక్షకు వెళ్లడానికి రెండుగంటల ముందు కొబ్బరినీళ్లు తాగాలి. తేనె, నిమ్మరసం, వేడి గంజి వంటివాటిలో ఏదైనా మంచిదే. దీనివలన శక్తి వస్తుంది. బయట ఆహారం, ఫాస్ట్‌ఫుడ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. మొలకలు, క్యారెట్, కీరదోస వంటివి తీసుకోవడం వల్ల మేలు కలుగుతుంది. ఇవి శరీరానికి నూతన ఉత్తేజాన్ని ఇస్తాయి.

– పి.కిరణ్మయి. వైద్యాధికారిణి

పునశ్చరణకే ప్రాధాన్యం



పరీక్షల సమయంలో కొత్తవి చదివేకన్నా పునశ్చరణకే ప్రాధాన్యత ఇవ్వాలి. పరీక్ష రోజున వేకువజామునే లేచి కొంతసమయం ముఖ్య, అతి ముఖ్య ప్రశ్నలు ఒకసారి మననం చేసుకుంటూ చదివితే మంచిది. పరీక్ష పేపరులో అక్షరాలు పొందికగా, పెద్దగా, చూడముచ్చటగా ఉండాలి. ఇంగ్లీషులో గ్రామర్, లెక్కల్లో ఫార్ములాలు, సైన్సులో డయాగ్రమ్‌లు, సోషల్‌లో మ్యాప్‌లు బాగా ప్రాక్టీస్ చేయండి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్‌కు విశ్రాంతి ఇవ్వడం మరచిపోవద్దు.

– గొర్రెల బాలయ్య, సబ్జెక్టునిపుణులు, ఎంఈవో–2

రంగులు వేస్తూ జారిపడి పెయింటర్ మృతి

భీమవరం: భవనానికి రంగులు వేస్తూ ప్రమాదవశాత్తూ పెయింటర్ జారి పడి మృతి చెందిన ఘటన భీమవరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం స్థానిక మారుతీనగర్‌లోని ఓ ఇంటికి పెయింటర్ చీర శివకుమార్(34) శుక్రవారం రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం నుంచి విజయవాడ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామపై అల్లుడు హత్యాయత్నం

ఏలూరు టౌన్: మామపై అల్లుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇది. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు తంగెళ్ళమూడి కబడ్డీగూడెంకు చెందిన ధర్మవరపు శ్రీను కుమార్తె జ్యోతికి కొత్తపల్లి వెంగళరావుతో 18 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వెంగళరావు మద్యానికి బానిసై ఇటీవల కాలంలో భార్య జ్యోతిని ఇష్టారాజ్యంగా కొడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ నెల 14న భర్త వేధింపులు భరించలేక జ్యోతి తండ్రి ఇంటికి వచ్చింది. వెంగళరావు అక్కడకు రావడంతో మామ అల్లుడి మధ్య వాగ్వివాదం చెలరేగి గొడవగా మారింది. అనంతరం మరోసారి రాత్రివేళ రాగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది.అల్లుడు వెంగళరావు తనతో తెచ్చుకున్న కత్తితో మామ శ్రీనుపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. భార్య లక్ష్మి, మనవడు కొత్తపల్లి నాగు శ్రీనుని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి ఆసుపత్రిలోని పోలీస్ ఔట్‌పోస్టుకు సమాచారం అందించారు. ఏలూరు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

ఉంగుటూరు: జాతీయరహదారిపై శనివారం కైకరం నుంచి భీమడోలు వెళుతున్న రెండు బైకులు ఢీకొని నలుగురుకి తీవ్రగాయాలు అయ్యాయి. ముందు వెళుతున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా రెండు బైక్‌ల హేండిళ్లు లింక్ అవడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులది కూరెళ్లగూడెం, పత్తేపురం గ్రామాలు అని తెల్సింది. క్షతగాత్రులు కె.సుగుణ (38), కె.శాంతిరాజు (39), జాన్సి (46), సాయికిరణ్(24) ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



ఈడూరులో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై తనిఖీలు



ఆరుగొలను గ్రామంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై శనివారం పంచాయతీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు షాపుల నుంచి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు కలిగి ఉన్నా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. భవిష్యత్‌లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'పది' పరీక్షలకు 829మంది విద్యార్థులు



పదో తరగతి విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మూడు రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ నెల 17వ తేది నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈవో వి.హనుమ శనివారం తెలిపారు. 14 జిల్లా పరిషత్‌ల నుంచి బాలుర 301మంది, బాలికలు 346మంది, ఆరుగొలను రెసిడెన్షియల్ నుంచి 75మంది, పెదతాడేపల్లి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 76మంది బాలురు, బీసీ రెసిడెన్షియల్ నుంచి 31మంది వెరసి మొత్తం 829మంది పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈవో హనుమ వివరించారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో మొత్తం 13 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

పది పరీక్షలకు నాలుగు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

అత్తిలి: ఈనెల 17 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అత్తిలి మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని మండల విద్యాశాఖాధికారి ఎస్ రమేష్ శనివారం చెప్పారు. అత్తిలి మండలంలోగల 10 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 4 ప్రైవే టు పాఠశాలలు, గణపవరం మండలం డీ కుముదవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 88మంది, ఆరవల్లి జెడ్పీ ఉన్న త పాఠశాలలో 97 మంది, అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 235మంది, కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 78 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఉద్యానవర్సిటీ పరిశుభ్రత కార్యక్రమంలో వీసీ కె.గోపాల్ తదితరులు

తాడేపల్లిగూడెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యానికి మంచిదని వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీలో శనివారం జరిగిన స్వచ్ఛ కార్యక్రమంలో వీసీ కె.గోపాల్ చెప్పారు. సీఎం ఆశయం స్వర్ణ ఆంధ్ర విజన్ లక్ష్యానికి అనుగుణంగా అందరూ ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్యోగులతో కలిసి పరిసరాల పరిశుభ్రం కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుమ్ము కొట్టుకుపోతూ..

- నరకం చూపుతున్న గూడ్స్ షెడ్ రోడ్డు మార్గం
- దుమ్ము, ధూళితో ప్రజల ఇబ్బందులు
- నీళ్లు చల్లుతూ ఉపశమనం పొందుతున్న స్థానికులు



శివాలయం వద్ద మరో బ్రిడ్జి వైపునకు దుమ్ము, ధూళితో వెళుతున్న లారీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో టూ టౌన్‌లోని గూడ్స్‌షెడ్డు రోడ్డు ఛిద్రమైంది. ఈ మార్గంలో ఆటో వెళ్లిన దుమ్ము రేగి ప్రయాణికుల కళ్లు మండుతున్నాయి. గూడ్స్‌షెడ్డు నుంచి వాహనాలు రాకపోకలు జరిపేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఒకప్పటి ప్రధాన పాత రహదారి, బౌ బ్రిడ్జి నేడు శిథిలమైంది. కూలేందుకు సిద్ధంగా ఉండటంతో బౌ బ్రిడ్జికు ఇనుప బ్యారియర్స్ (అడ్డంకులు) ఏర్పాటు చేశారు. పాదచారులు, సైక్లిస్టులు మినహా ఇతర వాహనాలు, లారీలు వెల్లడం లేదు. రహదారిని నిర్మించడంతో పాటు బౌ బ్రిడ్జి స్థానంలో మరో కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

శివాలయం వద్ద బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలు

ఈ క్రమంలో బౌ బ్రిడ్జిని మూసిన అనంతరం గూడ్స్‌షెడ్డు నుంచి వచ్చే అన్ని వాహనాలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నుంచి మరో ఇరుకు మార్గంలో శివాలయం రోడ్డుకు చేరడంతో పాటు శివాలయం సమీపంలో స్థానిక తణుకు వైపు బస్సుస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన మరో కొత్త బ్రిడ్జి మీదుగా ప్రస్తుతం వాహనాలు, లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గంలో ఎక్కువ సంఖ్యలో వాహనాలు ప్రయాణం చేయడంతో రద్దీ ఎక్కువ కావడంతో ట్రాఫిక్ ఎక్కువైంది. వాహనాలు జోరు పెరిగింది. దీంతో శివాలయం వద్ద నుంచి ఫ్లెటైవర్ బ్రిడ్జి వరకు ఉన్న రహదారి సైతం పూర్తిగా శిథిలమైంది. ఈ రహదారిలో రాళ్లు లేచి ఉండటం, అదే విధంగా గోతులు, గొప్పులతో ఉండటమే కాకుండా ధూళి పెద్ద మొత్తంలో చేరి ఉంది.



శివాలయం వద్ద దుమ్ము, ధూళితో మరో బ్రిడ్జి (స్థానిక తణుకు బస్ స్టాప్ వద్ద)

భారీ వాహనాలు వెళ్లితే...

ఈ రహదారిపై లారీలు వేగంగా వెళితే..దుమ్ము కమ్మేసి రోడ్డు కనిపించని దుస్థితి. రోడ్లుభవనాలశాఖ అధికారులు రోడ్డుపై కనీసం ట్యాంకర్లతో నీటి తడులూ అందించాల్సి ఉండగా..ఆ దిశగా చొరవ చూపడం లేదు. ఫలితంగా స్థానికులే రోజూ రెండు, మూడుసార్లు బిందెల్లో నీళ్లు తీసుకొచ్చి రోడ్డుపై చల్లుతున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డు బాగోగులను అధికారులు విస్మరించడంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారి నిర్మించి ఆదుకోండి



గూడ్స్‌షెడ్డు నుంచి శివాలయం బ్రిడ్జి వైపు ఇరుకు మార్గంలో వివిధ వాహనాలు, లారీలు నిత్యం రాకపోకలు చేస్తున్నాయి. ఈ వాహనాలు కారణంగా రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఆ మార్గంలో నెలకొని యున్న ఇళ్లు, ప్రైవేట్ కార్యాలయాలు, ఇతర వ్యాపార సంస్థలు దుమ్ము, ధూళితో నిండి ఉంటున్నాయి. దుమ్మధూళి కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రహదారి గాని తారు రోడ్డుగాని నిర్మించి తమను ఆదుకోవాలి.

– ఎల్‌డీవీ ప్రసాద్, స్థానికులు, శివాలయం వీధి, తాడేపల్లిగూడెం

శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి



గూడ్స్‌షెడ్డు నుంచి రాకపోకలు సాగించే లారీలు కారణంగా రహదారి మార్గంలో దుమ్ము, ధూళి పొగ మంచు తరహాలో పైకి లేస్తుంది. దీంతో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి, చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి, పరిసరాలలో సంచరిస్తున్న వారికి శ్వాస కోశ వ్యాధులు వస్తున్నాయి. అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మించే ఏర్పాటు చేయాలి.

– ఎం.శేషారత్నం, స్థానికురాలు, శివాలయం వీధి



శిథిలమైన బౌ బ్రిడ్జి



రోడ్డుపై దుమ్ము లేకుండా నీరు చల్లుతున్న స్థానికులు



బ్రిడ్జి వైపునకు దుమ్ము, ధూళితో వెళుతున్న లారీ

ముగిసిన ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సాధారణ పరీక్షలు ముగిశాయి. టౌన్‌లోని ఐదు సెంటర్‌లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు సంబంధించి మొత్తం 1,949 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1926 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఛీఫ్ సూపరింటిండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

సీఎంకు సీనియర్ సిటిజన్స్ వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ సమైఖ్య ఉపాధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. తణుకులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం తణుకు పర్యటించిన సీఎం చంద్రబాబును శనివారం హెలిప్యాడ్ వద్ద అసోసియేషన్ నాయకులు కలిశారు. రైల్వే టికెట్ ఛార్జీలపై రాయితీలు పునరుద్ధరించాలని, నడవలేని వృద్ధులకు ఉపకరణములు, చేతి కర్రలు, వాకర్లు, త్రీవీల్ చైర్స్, కళ్లజోళ్లు, చెప్పులు, వినికిడి యంత్రాలు ఉచితంగా ఇచ్చే కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరారు. సంఘ భవన నిర్మాణానికి 500 చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలో మునిసిపాలిటీ, గూడెం, పెంటపాడు మండలాలకు సంబంధించి వైఎస్సార్ సీపీ కమిటీలను అధిష్టానం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలను నియమించారు. గూడెం పట్టణ కమిటీ గౌరవాధ్యక్షుడిగా కర్రి భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా మేడపాటి జనార్ధన రెడ్డి, చెన్నా జనార్దన్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా గార్లపాటి వీరకుమార్, బోశం రమణ, పొట్లపల్లి రాంబాబు, బత్తిన గణేష్‌లను నియమించారు. కార్యదర్శులుగా వెలనాటి సత్తిబాబు, రాజా త్రినాథ్, ఎండీ.షరీఫ్, తాళ్లూరి మురళీకృష్ణ, ఇసరపు కాశీవిశ్వనాథంలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కోరపాటి వెంకటేశ్వరరావు, పోలిరాతి రవికిషోర్, సరిపల్లి రమణ, కొడవటి శ్రీను, శానం రామకృష్ణ, షేక్ మస్తాన్‌వలి, బంగారు దుర్గ, యేబోయిన మారుతీ దుర్గా ప్రసాద్, రామస్వామి, పెనుగొండ ఆంజనేయులును నియమించారు.గూడెం మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా చింతా వెంకట్రావు, గోపిరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా ముప్పిడి వెంకట్రామిరెడ్డి, రాపాక గోపీ, పత్సా అంజిబాబు, మాదేపల్లి సూర్యనారాయణలను నియమించారు. కార్యదర్శులుగా రాజమహేంద్రవరపు ఇజ్రాయెల్, పూడి సత్యనారాయణ, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, ఉప్పు రాజ్యలక్ష్మి, సబ్బితి బ్రహ్మయ్యలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కాసాని సోమేశ్వరరావు, జాలపర్తి శ్రీను, బడుగు వెంకటేశ్వరరావు, కాసగాని వెంకన్న , సూర్పన రామకృష్ణ, మేకా గోపాలం, బుర్ల కోటయ్య,కారింకి వీర్రాజు, వర్రా శ్రీనులను నియమించారు. పెంటపాడు మండల ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి ప్రసాదరెడ్డి, వల్లూరి బ్రహ్మానందం, గంధి రాజు, ప్రధాన కార్యదర్శులుగా దేవాబత్తుల వెంకన్నబాబు, బర్ల జయబాబు, పాలా గణపతిలు నియమించబడ్డారు. కార్యదర్శులుగా కొప్పిశెట్టి రామకృష్ణ, పొట్ల ఏడుకొండలు, కె. ధర్మారావు, వసంతాడ శ్రావణ్‌కుమార్, పెన్నాడ సూర్యనారాయణలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా జామి కృష్ణ, మిరియాల శేషు, తాడి భాస్కరావు, కె.నాగరాజు, బుల్లి పెంటయ్య, లక్కదాసు నరసింహమూర్తి, తెంటు గోపీలను నియమించారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త బోణం వీరయ్య

పెంటపాడు: మండలంలోని పడమరవిప్పర్రు గ్రామంలో వెంకటేశ్వరస్వామి నూతన ఆలయ, విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వేదపండితులు కొడవటిగంటి జనార్ధనాచార్యులు, టీటీడీ ధర్మగిరి బృంద సభ్యుల ఆధ్వర్యంలో హోమాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగనన్న హయాంలో దేవాదాయ శాఖామంత్రిగా తాను ఎన్నో హైందవ ఆలయాలు అభివృద్ధి చేయడంతో పాటు హిందూ సంస్కృతిని కాపాడేందుకు కోట్లాది రూపాయల నిధులుతో ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ. 10 లక్షలు అందించామన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన బోణం వీరయ్య, కుటుంసభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బోణం వీరయ్య మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, గ్రామ మాజీ సర్పంచ్‌లు డోకల నాగేశ్వరరావు, పసల చంటి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, గుండమోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్‌కుమార్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించడానికి గ్రామ కమిటీలు ఉపకరిస్తాయన్నారు. రానున్న కాలంలో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటి అధ్యక్షుడిగా ఇంటి ఆదినారాయణను నియమించారు. వైఎస్సార్ సీపీ నియోజవకర్గ సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు సిర్రావు శాంతకుమార్, తాడేపల్లి మునీశ్వరరావు (మోషే), మేకా సత్యనారాయణ, నూరిశెట్టి ధనరాజు, యడ్ల గటోదరుడు, ఊబా వెంకటేశ్వరరావు, కొమ్ము భాగ్యారావు, ఊబా వెంకటేశ్వరరావు, చిన్నం భాగ్యారావు, ఊబా నాని, బళ్ల వెంకటేశ్వరరావు, మామిడిపల్లి శ్రీనివాసరావు, ప్రత్తిపాటి లక్ష్మణరావు, మేకా శ్రీనివాసరావు, సుంకర నాగేంద్ర, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్నుల అలంకరణలో కనకదుర్గమ్మ



పెన్నుల అలంకరణలో అమ్మవారు

భీమవరం(ప్రకాశంచౌక్): పదో తరగతి పరీక్షల సందర్భంగా మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి 2 వేల పెన్నులు, ప్యాడ్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 17 నుంచి జరగనున్న పదో తర గతి పరీక్షలలో భాగంగా శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలు గొల్లపల్లి శ్యామ్ వెంకట త్రియాన్స్ దంపతులు, వి.అస్త్రిత్, శ్రీసత్యభాను, యర్రా సురేష్ దంపతులు, కాకులపాటి భానుమూర్తి దంపతులు, దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులు, ప్యాడ్స్‌తో అలంకరణ చేశారు.


లయన్స్‌క్లబ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయం



కైండ్‌నెస్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అధికార పర్యటనలో భాగంగా కైండ్‌నెస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. లయన్ గట్టిం ప్రవీణ్ కృష్ణ అధ్యక్షత వహించారు, స్వచ్ఛత సేవ, సైబర్ భద్రత, మహిళా సాధికారత అంశాలపై సేవలు అందించారు. తిమ్మరాజుపాలెం వృద్ధాశ్రమానికి రూ. 15 వేలు విలువైన సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కేవీ రామారావు, బొడ్డు అరుణ, జి.దుర్గా భావాని, పీవీ సత్యనారాయణ, ఎల్ వెంకటేశ్వరరావు, డైమండ్స్ సభ్యులు, లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అందరికీ అందాలి



సేవా కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సర్వీస్ సేవలు అందరికి అందాలని క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక క్లబ్ కార్యాలయం వద్ద జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆర్సీ పీవీ సత్యనారాయణ సహకారంతో ముగ్గురు పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. లంకా శ్రీనివాస్‌చే స్టూడెంట్స్‌కు విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామారావు, విష్ణు కుమార్, కొప్పిశెట్టి రమణయ్య చెన్నారెడ్డి, కాళ్ళ గోపికృష్ణ, కుందం వెంకటేశ్వరరావు, పుత్రయ్య, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



పట్టణంలో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 28న న్యూఢిల్లీలో పార్లమెంట్ ఎదుట జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు, ఛలో న్యూఢిల్లీ ధర్నా పోస్టర్‌ను శనివారం పట్టణంలో భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు వ్యవస్థను జాతీయ స్థాయిలో పటిష్టం చేయాలని, వెల్ఫేర్ సెస్సును ప్రస్తుతం ఉన్న ఒక శాతం నుంచి రెండు శాతానికి పెంచి వసూలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ వర్తింప చేయాలన్నారు. వృద్ధాప్యంలోని కార్మికులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మిక సంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, పడాల శ్రీనివాస్, అంకం భాస్కరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. మెండెం జేమ్స్, కోడే సాయి బాలాజీ, ఏరియా కమిటీ గౌరవాధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మాల మహానాడు, జేఏసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూడటం సరికాదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు విమర్శించారు. పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాజ్యాంగ విరుద్ధమని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేయాలే తప్పా, ఎస్సీల మధ్య చిచ్చుపెట్టకూడదని, లబ్ధిపొందాలని చూడకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలనుకుంటే తప్పక కుల గణన చేయాలన్నారు. రిజర్వేషన్ శాతాన్ని 20 శాతం పెంచి 13 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసినా చిట్టచివరకు ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు రద్దు చేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెనలను అమలు చేయాలని, నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు, నిరుద్యోగలకు రూ.3 వేలు భృతి, ఉచిత బస్సు అమలు చేయాలన్నారు. ఈ నెల 16న మాల సంఘాల జేఏసీ సమావేశం ఏలూరులోని లేడీస్ క్లబ్‌లో జరుగుతుందని, ఉమ్మడి జిల్లాలోని మాల సంఘాలు, జేఏసీ నాయకులు, సభ్యులు హాజరుకావాలని కోరారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. మానుకొండ శ్రీనుబాబు, కోట రత్నంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ పరిరక్షణకు ఉపకరిస్తాయన్నారు. మొక్కలను విరివిగా పెంచాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. పెదతాడేపల్లి గ్రామంలోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పోతుల అన్నవరం పాల్గొని వాడిపారేసే ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ అత్తింటి సోమశేఖరరావు, ఎమ్పీటీసీ గోవిందరాజు, పంచాయతీ కార్యదర్శి పి.సారిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వీరంపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎల్.అగ్రహారం సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోనూ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

305 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



వెంకట్రామన్నగూడెం గ్రామంలో పాడి రైతులకు సూచనలు చేస్తున్న ఏడీ అనిల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణటీకాలు వేసే కార్య క్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో 127 ఆవులు, 178 పాడి గేదెలకు టీకాలు వేశారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. సోమ వారం పెదతాడేపల్లి, ఆరుగొలను గ్రామంలో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.